==========================================================

A Guest Editorial on

Telugu Song’s gradual transition (Lyricist’s context)

-- Kamavaram Nanda Kishore

==========================================================

తెలుగు సినీ పాటను ఒక స్త్రీ మూర్తిగా పోలిస్తే ఎలా ఉంటుంది అని ఒక ఆలోచన వచ్చింది. వచ్చిన వెంటనే నా స్మృతి పథంలో అక్షరాలు వాక్యాలుగా రూపుదిద్దుకున్నాయి. నేను ఇక్కడ వెలిబుచ్చిన అభిప్రాయాలు అన్నీ నా ఊహా జనితమే. ఎవ్వరినీ నొప్పించాలని కాదు, బలవంతంగా ఎవరిపైనా రుద్దాలని కాదు.

హెచ్. ఎం. రెడ్డి గారు 1931 లో తొలి తెలుగు సినిమాను నిర్మించారు. అందులోనిదే తెలుగు సినీ పాట చరిత్రలోని మొదటి పాట. వ్రాసినది చందాల కేశవదాసు- "పరితాప భారంబు భరియింప తరమా". కానీ అప్పటి పాటలు చాలా వరకు రంగస్థలం మీద జనాదరణ పొందినవే. అందువలన నేను వాటిని సినీ పాటగా పరిగణించలేదు.

1940 ప్రాంతంలో ముగ్గురు వ్యక్తుల కలయికే మన పాట ఆవిర్భావం. "కల్లు మానండోయ్ బాబు.. కళ్ళు తెరవండోయ్" వంటి ప్రభోధాత్మక గీతాలు ఒక వైపు, "రాదే చెలీ.. నమ్మరాదే చెలీ.. మగవారినిలా నమ్మరాదే చెలీ" అంటూ సాందర్భిక గీతాలు సరిసమానంగా రాయగలిగిన సాహితీవేత్త సముద్రాల రాఘవాచార్య ఒక జనకుడిగా- "కలవరమాయే మదిలో, నా మదిలో" లాంటి వాడుక భాషలో గేయాలు రాస్తూ, "డింగరి, హత్తెరీ, జూలకటక, ఆమ్యామ్యా" అంటూ కొత్త కొత్త పదాలను సృష్టించిన అభినవ నన్నయ పింగళి నాగేంద్రరావు మరో జనకుడిగా- కొసరాజు రాసిందే జనపదం, అదే జానపదం అనేంత స్థాయిలో జానపద కళారూపాలని ఔపోసన పట్టిన అపర అగస్త్యుడు కొసరాజు రాఘవయ్య చౌదరి మూడో జనకుడిగా పుట్టింది మన తెలుగు పాట.

పుడుతూనే తనతో పాటు ఆడటానికి, కలిసి పెరగడానికి పంచపాండవుల్లాంటి అయిదుగురు సోదరులను వెంట పెట్టుకు వచ్చింది. ఒక్కొక్క సోదరుడు ఒక్కొక్క విధంగా ఆటా, పాటా నేర్పారు మన నాయికకు. "అందమైన లోకమనీ, రంగు రంగులుంటాయని అందరూ అంటుంటారే రామ రామా.. అంత అందమైనది కానే కాదు చెల్లెమ్మా " అంటూ ఎలా మెలగాలో పెద్దన్నగా నేర్పాడు ఆత్రేయ. "మనసున మల్లెల మాలలూగెనే" అంటూ భావుకత్వం, లాలిత్యం, సౌకుమార్యం నేర్పాడు దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒక అన్నగా. "మది శారదా దేవి మందిరమే" అంటూ భక్తి భావం నేర్పే అన్నగా మల్లాది రామకృష్ణ శాస్త్రి. ఇంటా బయటా ప్రతి ఒక్కరితో పోట్లాడుతూ, విప్లవ భావాలు, పదునైన జవాబులతో సమాజాన్ని ఎదుర్కొనడానికి ధైర్యము, స్థైర్యము పెంచి, తెలుగువారి సత్తా జాతీయ స్థాయిలో నిరూపించాడు ఒక అన్న! ఆయనెవరో నేను వేరే చెప్పక్కరలేదు కదా- శ్రీశ్రీ గా గుర్తింపబడిన శ్రీరంగం శ్రీనివాసరావు. సోషలిజం నుండి అవకాశవాదం వరకు, పలాయనవాదం నుండి ప్రయత్నాబలం వరకు, సైన్సు నుండి సెక్స్ వరకు ఏదీ వదలకుండా, సమయం చిక్కినప్పుడల్లా చెబుతూ అప్పుడప్పుడు పెడత్రోవ పట్టించే ఒక అన్నగా పెరిగాడు "మానవుడే మహనీయుడు " అంటూనే, "నేడు అమ్మాయి కూడ తొడుగుతుంది బుష్ ప్యాంట్ " అన్న భాగవతుల సదాశివశంకర శాస్త్రి (ఆరుద్ర).

వీరి మధ్య ఆడుతూ, పాడుతూ పెరిగింది మన పాట. టీనేజ్ లోకి అడుగుపెట్టేసరికి నాన్న, అన్నల మాటలు బోరు కొట్టసాగాయి. కొత్త కొత్త అందాలు చూడాలనుకుంది. కొత్త కొత్త సోయగాలు సంతరించుకోవాలనుకుంది. అప్పుడు వచ్చారు ఆమె జీవితంలోకి ఇద్దరు చెలికాళ్ళు. వచ్చి ఆమెలో ఉన్న ఆమెకే తెలియని పరువాలను చూపారు. దానితో మన నాయిక తన సమానమే లేరు అనుకునే స్థాయికి చేరుకుంది. తోటి స్త్రీలు కంటికే కానరారాయే! (ఇది నిజం -1960-70 ప్రాంతంలో తెలుగు పాట నభూతో న భవిష్యతి గా వెలిగింది - స్వర్ణయుగం). ఇంతకూ ఆ ఇద్దరు చెలికాళ్ళు ఎవరో మీరు ఊహించే ఉంటారు - "కనుల ముందు నీవుంటే కవిత పొంగి పారదా " అన్న సింగిరెడ్డి నారాయణరెడ్డి మరియు "ఏ దివిలో విరిసిన పారిజాతమో " అన్న దాశరథి.

సరే, పెళ్ళి వయసు వచ్చిందని మంచి వరుణ్ణి వెదుకనారంభించారు అన్నలు. అప్పటికే "ఇదిగో దేవుడు చేసిన బొమ్మ " అంటున్న మైలవరపు గోపి, "ఓ రాతిరి " అంటూ సహజంగా కవిత్వం చెప్పే మల్లెమాల సుందరరామిరెడ్డి, "నీ అమ్మవాడు నాకోసం ఈని ఉంటాది" అంటూ వెంటపడుతున్న దాసం గోపాలకృష్ణ ఉన్నారు. వీరెవరూ మన నాయికకు నచ్చలేదు. తిరిగి వెదుకులాట ప్రారంభం. అప్పుడే "భారత నారి చరితము మధుర కథా భరితము " అంటూ ఉజ్వలంగా వెలుగుతున్న వ్యక్తి ఒకరు కనిపించారు. చూసిన మొదటి చూపులోనే మన నాయికకు చెప్పలేనంతగా నచ్చాడు. ఆయనే వేటూరి సుందర రామమూర్తి. రంగరంగ వైభవంగా పెళ్ళి జరిగింది. వారి కాపురం మూడు గేయాలు, ఆరు పాటలుగా సాగింది. భార్యను ఆరు రూపాలలో చూడాలంటారు పెద్దలు - దాసిగా, లక్ష్మిగా, రంభగా, తల్లిగా, ధరిత్రిగా, మంత్రిగా.. ఈ ఆరు రూపాలలో మన నాయికను చూసుకున్నాడు మన నాయకుడు. "అందానికి అందం ఈ పుత్తడి బొమ్మ " అంటూ వర్ణించాడు.. "సీతాలు సింగారం మా లచ్చి బంగారం " అన్నాడు.. "జాబిలితో చెప్పనా జాముురాతిరి నీవు చేసిన అల్లరి " అంటూ ఆటపట్టించాడు.. "దొరకునా ఇటువంటి సేవ " అంటూ సేవించాడు.. "నరుని బ్రతుకు నటన " అంటూ వేదాంతం నేర్పించాడు.. "ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో " అంటూ భార్యను ఎవరన్నా వేలెత్తి చూపితే దుయ్యబట్టాడు.. "మానసవీణా మధుగీతం మన సంసారం ఓ సంగీతం " అన్నాడు.. గర్భవతి భార్యకు "జో..లాలి " అంటూ సీమంతం జరిపాడు.

అలా మన నాయిక సంసారం అప్పుడప్పుడూ వచ్చిపోయే బంధువులతో (రాజశ్రీ, పాలగుమ్మి పద్మరాజు, సముద్రాల జూ., జగ్గయ్య, గుంటూరు శేషేంద్రశర్మ, యస్వీ భుజంగరాయశర్మ, కొనకళ్ళ వెంకటరత్నం, వీటూరి, తోలేటి, మొ..) కళ కళ లాడిపోయింది. వచ్చిన బంధువులనందరినీ నిండు హృదయంతో ఆదరించింది, అభిమానించింది.

ఇలా వారి కాపురం 1975 నుండి 1984 దాకా చాలా అన్యోన్యంగా సాగింది. వీరి కాపురం ఎంతో మంది కంటికి కినుక అయ్యింది. విధి కాటువేసింది. మన నాయకుడు దుర్వ్యసనాలకు బానిస అయ్యాడు (ఇక్కడ బూతు పాటలు అని అర్థం). భార్యను హీనంగా చూడటం ప్రారంభించాడు. "కొట్టండి.. గిల్లండి.. గిచ్చండి " అని పదిమంది ముందు అనడం ప్రారంభించాడు. తనకు మాటలు నేర్పిన అయిదుమంది అన్నలలో ముగ్గురిని కోల్పోయింది. మిగిలిన ఇద్దరు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.. తనకు సోయగాలు నేర్పిన స్నేహితులనుండి ఓదార్పు మాటలు తప్ప వేరే ఏ సహాయము ఒరగలేదు. ఆమె వేదన అరణ్యరోదన అయింది. చివరకు కష్టాలకు అలవాటు పడటం ప్రారంభించింది. "అనుకున్నామని జరగవు అన్నీ.. అనుకోలేదని ఆగవు కొన్ని.. జరిగేవన్నీ మంచికని అనుకోవడమే మనిషి పని " అన్న పెద్దన్న మాటలు గుర్తుకువచ్చాయి.

ఇలా బాధలనే ఆహారంగా సేవిస్తూ జీవిస్తున్న సమయంలో - "నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని " అంటూ తల్లికి ధైర్యం నూరిపోసే కొడుకుగా.. "అలుపన్నది లేదు ఎగిరే అలకు " అంటూ ఆశావాదాన్ని.. "ఆశ నీకు అస్త్రమవును, శ్వాస నీకు శస్త్రమవును " అంటూ ఉద్బోధ చేసే సంజాతుడిగా.. "నువ్వేమి చేశావు నేరం.. నిన్నెక్కడంటింది పాపం.. చినబోకుమా " అంటూ ఓదార్చే నోముల పంటగా.. "విరించినై విరచించితిని ఈ గీతం " అంటూ వెన్నెలలు కురిపించే పాటలనే ఇంటిపేరుగా పెట్టుకుని వచ్చాడు మన నాయిక జీవితంలోకి తనయుడిగా, సీతారామశాస్త్రి.

అంతదాకా నిస్సత్తువగా, నీరసంగా ఉన్న మేనమామలు కూడా తిరిగి చైతన్యవంతులయ్యారు. "శ్రీరస్తు.. శుభమస్తు " అని ఒకరంటే, "మనసాక మధుకలశం " అని ఇంకొకరన్నారు.. మన నాయకుడు కూడా తన తప్పును తెలుసుకొని తన భార్యను ఏకంగా జాతీయ స్థాయిలో నిలబెట్టాడు, "రాలిపోయే పూవా నీకు రాగాలెందుకే " అంటూ. పెద్దకొడుకుగా ఉండీ లేనట్టుండే జాలాది తో పాటు వెన్నెలకంటి, జొన్నవిత్తుల, భువనచంద్ర లాంటి సంతానంతో కొంతకాలం హాయిగా గడిపింది. సంతానం పెరుగుదల చూస్తూ వార్ధక్యంలోనికి అడుగుపెడుతున్న మన నాయికకు "మంచు కొండల్లోన చంద్రమా " అంటూ ముద్దు ముద్దు మాటలతో పెరిగి, "వయస్కాంతము ", "లిప్సరసం " లాంటి కొత్త కొత్త పదాలతో ముత్తాతలనే మించిపోవాలని కలలుకంటున్న చంద్రబోస్, తండ్రి బాటలోనే నడవడానికి ప్రయత్నిస్తున్న భాస్కరభట్ల, కులశేఖర్ లాంటి మనవళ్ళు పుట్టారు.

వీరు తన ఘన వంశాన్ని ఎలా నిలబెడతారో అంటూ తన చివరి క్షణాలను లెక్కబెట్టుకొంటూ కాలం వెళ్ళబుచ్చుతూ ఉంది మన

నాయిక.

ఈమె జీవితానికి ఎటువంటి ముగింపు ఉండకూడదని నా ఆకాంక్ష. తెలుగు పాట చిరంజీవిగా మిగలాలని కోరుకునే ఎనిమిది కోట్ల ఆంధ్రులలో నేనూ ఒకణ్ణి.

-- నందకిశోర్ కామవరం
మే 31, 2007
(chiltu@gmail.com)

రచయిత గురించి :

------------------------------

స్వగ్రామం: ఆదోని (కర్నూలు జిల్లా); వృత్తి: కెనరా బ్యాంకు లో Software Implementing Officer, బెంగుళూరు.

సంగీత, సాహిత్యాలతో ప్రగాఢమైన అనుబంధం ఉన్న నందకిశోర్ గారికి సాహిత్యపు విలువలున్న ప్రతీ పాట ఇష్టమే! తనకి ఎంతో స్థైర్యాన్ని ఇచ్చిన "ఎక్కడ ఉన్నా ఏమైనా (మురళీకృష్ణ) ", "ఎప్పుడూ కోరుకోవద్దురా ఓటమి (పట్టుదల) " లాంటి పాటలకు మాత్రం ప్రత్యేక స్థానం ఇస్తారు. బాలు పాటలంటే ప్రాణమిచ్చినా సైగల్, తలత్ మెహమూద్, రఫీ, కిషోర్ కుమార్ వంటి హిందీ గాయకుల.. ఘంటసాల, సుశీల, జానకి వంటి తెలుగు గాయకుల పాటలను కూడా అంతే ఆసక్తితో వింటారు.. కొందరు నటులు (కృష్ణ, దేవానంద్) కేవలం పాటల వల్లనే అభిమాన నటులయ్యారంటే అతిశయోక్తి కాదు.. అలనాటి పాటల రచయితలు, సంగీత దర్శకులందరూ నచ్చినవారే. ఈనాటి సినీ సాహిత్యంలో వెన్నెలలు కురిపిస్తున్న సీతారామశాస్త్రి అంటే ప్రత్యేకమైన అభిమానం..

విశ్వనాథ, యద్దనపూడి, యండమూరి నవలలంటే ఇష్టమున్నా తిమ్మన వారి "పారిజాతాపహరణం", పింగళి సూరన వారి "రాఘవపాండవీయం" లాంటి ప్రాచీన కావ్యాలంటే మక్కువ ఎక్కువ. బాణభట్టుని "కాదంబరి" , Ayn Rand’s "Atlas Shrugged" అత్యంత ఇష్టమైన పుస్తకాలు..

ChimataMusic.com లో పాటలు వింటూ, db లో active గా పాల్గొనడం తన దినచర్యలో అతిముఖ్య భాగమై పోయిందంటున్న నందకిశోర్ గారు డిబి లో సినీ లోకానికి చెందిన ఆసక్తికరమైన విషయాలను తెలియబరచడం / తెలుసుకోవటం లో ఎంతో ఆసక్తిని కనబరుస్తారు.

------------------------------

Acknowledgements: ఈ ఆర్టికిల్ ఎడిటింగ్ లో సహకరించిన "నిషిగంధ" గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.